క్లుప్తంగా

పాలిటెక్నిక్‌లో సీట్ల కోసం సంప్రదించండి

రాయచోటి టౌన్‌ : రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నికల్‌ కళాశాలలో నేరుగా చేరదలచుకున్న విద్యార్థులు సంప్రదించాలని ఆ కళాశాల ప్రిన్సిపల్‌ శివశంకర్‌ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలిటెక్నికల్‌ కోర్సులలో పాలీసెట్‌ పద్ధతి ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. దీంతో తొలిదశ ముగిసినదని తెలిపారు. ఇక మిగిలిన సీట్ల కోసం ఈసీఈ, ఈఈఈ గ్రూపులకు అర్హత కలిగిన/అర్హత లేని వారు (పదవ తరగతి పాస్‌ అయిన విద్యార్థులు) నేరుగా చేరేందుకు అర్హులన్నారు. దీని కోసం నేరుగా అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 31లోగా నేరుగా తమ ఒరిజనల్‌ సర్టిఫికెట్లుతో ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని చెప్పారు. నేరుగా అడ్మిషన్‌తో చేరేవారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఫీజ్‌ రీఎంబర్స్‌ వర్తించదని తెలిపారు. అడ్మిషన్‌ ఫీజులు ఓసీ/బీసీ/ మైనార్టీలకు రూ.5800లు, ఎస్సీ/ఎస్టీలకు అయితే రూ.5050లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. తమ కళాశాలకు నేషనల్‌ బోర్డు ఆఫ్‌ అక్రిడేషన్‌ గుర్తింపు ఉందన్నారు.

మహిళపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

రాయచోటి అర్బన్‌ : వీరబల్లి మండలం షికారు పాళెంలో మహిళను చెట్టుకు కట్టేసి హింసించిన వారిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్‌ చేశారు. గురువారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునేలా మహిళపై కోడిగుడ్లతో దాడి చేయడం ఆటవిక చర్యగా అభివర్ణించారు. ఎవరైనా తప్పులు చేస్తే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలేకాని ఇలా భౌతిక దాడులకు పాల్పడడం తగదన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఎం నేతలు రామాంజులు, బసిరెడ్డి, ప్రభాకరరెడ్డిలు పాల్గొన్నారు.

కాలానికి అనుగుణంగా బోధన మారాలి


యూనిఫాం అందిస్తున్న ఉపాధ్యాయులు

సంబేపల్లె : కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకొని బోధన చేయడం ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయని ప్రధానోపధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్‌ వారోత్సవాలలో భాగంగా సాంకేతిక నైపుణ్యాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు విద్యా కిట్‌లో భాగంగా ప్రభుత్వం అందించిన యూనిఫాంను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్‌ అధికారి ఓబుల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ నాగేశ్వర్‌నాయుడు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌, రవిశంకర్‌, విజయసారధిరెడ్డి, మహబూబ్‌బాషా, ఉమాదేవి, జోసెఫ్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

అపోహలు వీడి రక్తదానం చేయండి

రాయచోటి టౌన్‌ : అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని నేషనల్‌ బ్లడ్‌ ప్రమోటర్‌ డాక్టర్‌ మైనుద్దీన్‌ అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని జగదాంబ సెంటర్‌కు చెందిన శిల్ప అనే గర్భిణికి అత్యవసర సమయంలో బీ పాజిటివ్‌ రక్తం కావాలని కోరగా వెంటనే స్పందించిన మస్తాన్‌ అనే యువకుడితో రక్తదానం చేయించారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


కొత్తపల్లెలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్న దృశ్యం

రామాపురం : ఈఓపీఆర్డీ ఉషారాణి ఆదేశాల మేరకు మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీలో సర్పంచ్‌ ధనలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ నాగమణిల ఆధ్వర్యంలో శుక్రవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కొత్తపల్లి గ్రామంలోని వీధుల్లోని చెత్తాచెదారం, గ్రామానికి ఆనుకొని ఉన్న దిబ్బలను, కంపచెట్లను తొలగించి బ్లీచింగ్‌, సున్నంను పిచికారీ చేయించారు. కొత్తపల్లి నుంచి గువ్వలచెరువు వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంప చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించారు. గువ్వలచెరువు పైభాగంలో నుండి నాయునిచెరువుకు వచ్చే సప్లై ఛానల్‌కు ఉన్న కంప పాదలను జేసీబీ సహాయంతో తొలగించి కూలీలతో పనులు చేపట్టి వాటిని తొలగించారు. అన్ని పల్లెల్లోనూ ఈ విధంగా పారిశుద్ధ్యం పనులు చేపట్టారు.

మాండవ్యకు మంచి రోజులొచ్చేనా?

- అధికారుల పర్యవేక్షణ లేక మురుగునీటి మయంగా మాండవ్య
- దోమల బెడదతో అల్లాడిపోతున్న పరివాహక ప్రాంత ప్రజలు
- అమాత్యుడు స్పందిస్తే దుస్థితి మారుతుందంటున్న పట్టణవాసులు


రాయచోటి పట్టణ పరిధిలో మురుగునీరు, కంపచెట్లతో నిండిన మాండవ్య నది

రాయచోటి : ఒకప్పుడు రాయచోటి పట్టణ ప్రజలకు మంచినీటి దాహార్తిని తీర్చిన మాండవ్య నది.. నేడు మురుగునీటి ప్రవాహానికి నిలయంగా మారింది. రాయచోటి పడమటి భాగంలో ఉన్న కంలా చమ్మ గండి చెరువు నుంచి రాయచోటి పట్టణంతో పాటు మాసాపేట, పాత రాయచోటి, చెన్నముక్కపల్లి, దిగువ అబ్బవరం గ్రామాల పరిధిలోని ఆరు కిలోమీటర్లకు పైగా మాండవ్య నది ప్రవాహం ఉంటుంది. ఈ నది ద్వారా ప్రవహించే మంచినీటిని దశాబ్దన్నర కాలం కిందట వరకు తాగునీటికి ఉపయోగించేవారు. కాలానుగుణంగా పట్టణ పరిధి పెరగడం, గణనీయంగా జనాభా పెరగడం ప్రణాళికబద్ధంగా డ్రైనేజీ నిర్మాణం లేకపోవడంతో మురుగునీరు మాండవ్య నదికి చేరువవుతూ వచ్చింది. వీటికి తోడు నదిలోని ఇసుక అడుగు వరకు తోడివేయడంతో ఎక్కడపడితే అక్కడ గోతులుగా మారి చిన్నపాటి సెలయేర్లను తలపిస్తోంది. నదికి ఇరువైపులా నీటి తరలింపునకు కాలువలు ఏర్పాటు చేసిన వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో పూడికతో పూర్తిగా నిండిపోయింది. మరికొన్ని ప్రాంతాలలో నది పరివాహక ప్రాంతం ఆక్రమణలకు గురి కావడంతో కాలువలు కనిపించకుండా పోయాయి. ఇలా అనేక కారణాల కారణంగా పవిత్రమైన జలాశయాన్ని అందించే మాండవ్య నదికి మురుగునీరు ప్రవాహం ప్రాంతంగా మారింది. నదిలో ఎక్కడ చూసినా మురుగునీరు నిలువ ఉండటంతో పందులకు విడిది కేంద్రంగా మారింది. అలాగే దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా మారాయి. రెండు సంవత్సరాల కిందట మాండవ్య నదిలో పేరుకుపోయిన ముళ్లపొదలను, చెత్తను తొలగించడంతో కొంత మురుగునీరు కొట్టుకుపోయింది. తిరిగి ముళ్లపొదలు పెరగడం, పట్టణంలోని చెత్తా చెదారమంతా నదిలోకి చేరడంతో మురుగునీటిమయంగా కనిపిస్తోంది. నది పరిసర ప్రాంతాలకు వెళ్లాలంటేనే ముక్కుపుట్టలు అదిరిపోయే దుర్వాసనతో బెంబేలెత్తిస్తోంది. నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న వారి పరిస్థితి వర్ణణాతీతంగా మారింది. ఒకవైపు దుర్వాసన, మరోవైపు దోమల దాడులు ఆ ప్రాంత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దోమల దాడులతో విష జ్వరాలు బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరగలేక అల్లాడిపోతున్నారు.

మాండవ్య నదిపై మంత్రి స్పందించేనా..

పట్టణ నడిబొడ్డున ప్రవాహంగా ఉన్న మాండవ్య నది శుభ్రతకు రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. మాండవ్య నదిని మంత్రి ఒక మారు పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో సత్వర చర్యలకు ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. నదిలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని, ముళ్ల పొదలను తొలగించే చర్యలు చేపట్టాలని స్థానికులు అంటున్నారు. అలాగే నదికి ఇరువైపులా శాశ్వతమైన డ్రైనేజీని నిర్మించి రాయచోటి పట్టణానికి సుదూరంగా మురికినీటిని తీసుకెళ్లేలా చూడాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

పరిశుభ్రతకు చర్యలు చేపడతాం

రెండు సంవత్సరాల కిందట ముళ్లపొదలు, మురుగునీటితో నిండిపోయి ఉన్న మాండవ్య నదిని శుభ్రం చేయించాం. నదికి ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించి నదిలో మురుగునీరు నిలువకుండా ప్రవహించేలా చేశాం. పట్టణంలోని మురుగునీటిని ప్రత్యేక కాలువలు ద్వారా తీసుకెళ్లి ప్యూరిఫికేషన్‌ చేయించి ఆ నీటిని తిరిగి వాడుకునేలా ప్రణాళికలు రూపొందించాం. సకాలంలో నిధులు అందకపోవడంతో ఆ పని వాయిదా పడుతూ వస్తోంది. తిరిగి మాండవ్య నదిలో మురుగునీరు మడుగులుగా ఏర్పడటంతో దోమల ఉత్పత్తి పెరిగింది. సమావేశంలో చర్చించి మాండవ్య నదిని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడతాం.


– ఎస్‌.ఫయాజ్‌ బాషా, మున్సిపల్‌ చైర్మన్‌, రాయచోటి

29 నుంచి రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

రాయచోటి అర్బన్‌ : ఈనెల 29, 30, 31 తేదీలలో మదనపల్లె పట్టణంలో రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనంను నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్‌ చిత్రపటం వద్ద శుక్రవారం ఆయన రైతు సమ్మేళనం కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటిపోతున్నా రైతులు గౌరవంగా జీవించే పరిస్థితులు లేవన్నారు. పాకులు అనుసరిస్తున్న విధానాల కారణంగా రాష్ట్రంలో రైతులు, కౌలురైతులు, చేతి వృత్తిదారుల స్థితిగతులు రోజురోజుకు దిగజారిపోతున్నాయన్నారు. రాష్ట్రస్థాయి రైతుసమ్మేళనంలో రైతుల స్థితిగతులపై పూర్తి స్థాయిలో చర్చించడం జరుగుతుందన్నారు. సమ్మేళనానికి జిల్లాలోని రైతులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వరినారు కొనలను తుంచి నాటుకోవాలి


క్షేత్రస్థాయిలో వ్యవసాయ కూలీలకు సూచనలు చేస్తున్న ఏఓ రమేష్‌రెడ్డి

సిద్దవటం : రైతులు పొలంలో వరి నాట్లు నాటే సమయంలో వరి నారు కొనలను తుంచి నాటుకోవాలని తద్వారా కాండం తొలుచు పురుగును నివారించవచ్చునని వ్యవసాయాధికారి కె. రమేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఖాజీపల్లె, డేగనవాండ్లపల్లె గ్రామాల్లోని వరి నాటే పొలాలను వ్యవసాయాధికారి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాండం తొలుచు పురుగు, తల్లి పురుగు గుడ్లను నారు కొనలపై సామూహికంగా పెట్టి నూగుతో కప్పి ఉంచుతుందన్నారు. కొనలు తుంచి నాటడం వల్ల ఈ సమస్యాత్మక పురుగును ప్రారంభ దశలోనే నివారించవచ్చన్నారు. తద్వారా పురుగు మందును గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. వరిలో కాండం తొలుచుపురుగు, ఆకు చుట్టు పురుగు ఉన్నట్లు గమనించామన్నారు. వీటి నివారణకు క్లోరోఫైరీఫాస్‌ అనే మందును ఒక లీటరు నీటికి 2ఎంఎల్‌ చొప్పున, కార్బోఫీరాన్‌ 3జి గుళికలను ఎకరాకు 10 కిలోల చొప్పున ఇసుకతో కలిపి చల్లుకోవాలని రైతులకు తెలియజేశారు. అలాగే ప్రతి రైతు భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వేసుకోవాలని, రైతులకు సూచించడం జరిగిందన్నారు. అలాగే బాస్వరం ఎరువులు అయినటు వంటి డీఏపీ, సింగిల్‌ సూపర్‌ ఫాస్టు ఎరువులను దుక్కిలోనే వేసుకోవాలని రైతులకు తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వంశీ, శివఫణీంద్ర, రైతులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు

రాయచోటి అర్బన్‌ : రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చొరవతో మున్సిపల్‌ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో యుద్ధప్రాతిపదికన బోర్‌ డ్రిల్లింగ్‌ కార్యక్రమం జరిగింది. గురువారం మంత్రి సోదరుడు రాహుల్‌రెడ్డి 33వ వార్డు పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నీటిసమస్య తీవ్రంగా ఉన్న విషయాన్ని రాహుల్‌రెడ్డి వెంటనే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సమస్య పరిష్కరించాలంటూ మున్సిపల్‌ అధికారులను ఆదేశించారు. రంగంలోకి దిగిన అధికారులు బోరు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

‘మా ఆదేశాలతోనే ఏ కార్యక్రమమైనా జరగాలి’

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఎవరూ లేరు
- తహసీల్దార్‌కు తెలియజేసిన తెలుగు తమ్ముళ్లు


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

సిద్దవటం : మండలంలో ఏ ప్రభుత్వ కార్యక్రమమైనా మా ఆదేశాలతోనే జరగాలని సిద్దవటం తహసీల్దార్‌ మురాషావలికి టీడీపీ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, క్లస్టర్‌ ఇన్‌చార్జ్‌ దశరథరామనాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం వారు తహసీల్దార్‌ కార్యాలయంలో ఆయన్ను కలుసుకొని మాట్లాడారు. రాజంపేట నియోజకవర్గంలో కూటమి పార్టీ ఇన్‌చార్జిగా రాష్ట్ర అధినాయకత్వం ఎవరినీ నియమించలేదని చెప్పారు. ఎవడు పడితే వాడు ఇన్‌చార్జిల మని చెప్పుకుంటూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అధికారుల సమయాభావాన్ని వృథా చేస్తున్నారన్నారు. రేషన్‌ డీలర్ల విషయంలో తహసీల్దారు ఎటువంటి నిర్ణయం తీసుకోవద్దని ఆయన తెలిపారు. క్లస్టర్‌ ఇన్‌చార్జి దశరథరామనాయుడు మాట్లాడుతూ రాజంపేట ఇన్‌చార్జిలు ఎవరూ లేరని ఈ విషయాన్ని మండల అధికారులు తెలుసుకోవాలన్నారు. ఏ కార్యక్రమమైనా మండల అధ్యక్షులు, క్లస్టర్‌ ఇన్‌చార్జిల ఆదేశాలతో జరగాలని తహసీల్దార్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌లు సంజీవరెడ్డి, జవహర్‌బాషా, టీడీపీ రాష్ట్ర బీసీ కార్యదర్శి కె.శ్రీనివాసులనాయుడు, మజీ ఎంపీపీ నరసింహారెడ్డి, బాలిరెడ్డి, తుర్రా ప్రతాప్‌, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న దాది శ్రీను

లక్కిరెడ్డిపల్లె : దివ్యాంగులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి దాది శ్రీను పేర్కొన్నారు. మండలంలోని వెలుగు ఆఫీస్‌లో నిర్వహించిన సమావేశంలో దాది శ్రీను మాట్లాడుతూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ల దృష్టికి తీసుకెళ్లగా వారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. మండలంలోని దివ్యాంగులందరికీ ఇళ్ల స్థలాలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. అదే విధంగా తప్పుడు పత్రాలతో దివ్యాంగుల పెన్షన్‌ పొందుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శివకుమార్‌, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్‌ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించండి

సిద్దవటం : ఈ ఏడాది మార్చి నెలలో నియమించిన ఎయిడెడ్‌ ఉపాధ్యాయులకు 4 నెలల జీతాలను వెంటనే మంజూరు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంభం బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎండీ ఇలియాస్‌బాషా తెలిపారు. సిద్దవటం మండలంలోని వెంకటేశ్వరపురం ఎంపీయూపీ స్కూల్‌లో శుక్రవారం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం 11వ పీఆర్‌సీ అస్తవ్యస్తంగా అమలు పరిచిందన్నారు. అందులో భాగంగా హెచ్‌ఆర్‌ఏ స్లాబ్‌ను 12 శాతం, 14.5 శాతం, 20 శాతం ఉన్నవాటిని తగ్గించి 10 శాతం, 12 శాతం, 16 శాతంగా అమలు పరచిందన్నారు. ఇది ఉపాధ్యాయ, ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగించిందన్నారు. మునిసిపాలిటీ, కార్పొరేషన్‌లలో నివసించే ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఇబ్బంది పడుతున్నారన్నారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం 12వ పీఆర్‌సీలో పాత హెచ్‌ఆర్‌ఏ స్లాబ్‌లను పునరుద్ధరించాలని కోరారు. ప్రస్తుత విద్యా విధానాన్ని వీలైనంత తొందరగా సమీక్షించి మార్పు చేయాలని కోరారు. అనంతరం వారు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులచే సభ్యత్వంను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో సిద్దవటం మండల అధ్యక్షులు రమణ, ప్రధాన కార్యదర్శులు నరసింహులు, రామాంజనేయులు, రామలింగరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి


మాట్లాడుతున్న ఏయూ అధినేత చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : తల్లిదండ్రుల ఆశయాలను విద్యార్థులు నెరవేర్చేలా క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించాలని ఏయూ (అన్నమాచార్య యూనవర్సిటీ) అధినేత చొప్పా గంగిరెడ్డి సూచించారు. శుక్రవారం ఏయూ ఆడిటోరియంలో బీటెక్‌ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఓరియంటేషన్‌ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతి విద్యార్థి కష్టంగా కాకుండా ఇష్టంగా తాము ఎంచుకున్న ఇంజనీరింగ్‌ విద్యను చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుకు అన్ని విధాలుగా అన్నమాచార్య యూనవర్సిటీ దోహదపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతానికి అన్నమాచార్య యూనవర్సిటీ ప్రతి ఒక్క విద్యార్థి అందుబాటులో ఉన్నట్లేనన్నారు. సమావేశంలో ఏయూ ప్రతినిధులు చొప్పా అభిషేక్‌రెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్‌ డా.నారాయణ, డీన్‌ శివరామిరెడ్డి, డా.ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు గంగమ్మకు పూజలు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం కోర్టు ఆవరణంలో వెలసిన గంగమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. రాహు,కాల పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయం ఎదుట నిమ్మకాయలతో నెయ్యి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక వాసవీభవన్‌ వీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించి పూజలు చేశారు.

చామంతి తోటల పరిశీలన

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె రైతు సేవా కేంద్రం పరిధి కొమ్మనాయునిపల్లె గ్రామంలో రైతులు బారెడ్డి ఓబులేసురెడ్డి, గునుకుంట్ల ఎల్లారెడ్డి, వీరంరెడ్డి రామిరెడ్డిలు సాగుచేసిన చామంతి పొలాలను శుక్రవారం బద్వేల్‌ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలో రసం పీల్చు పురుగు ఉధృతి వలన ఆకుముడతను గమనించామన్నారు. అలాగే పసుపు పంట, వరి నారు మళ్లను పరిశీలించామన్నారు. చామంతిలో ఆకు ముడుత నివారణకు జిగురు పూసిన పసుపు, తెలుపు పల్లాలు, వేప గింజల కషాయం తయారు చేసుకొని వాడాలన్నారు. సిద్దవటం గ్రామ శివారులోని పెన్నానది వంతెన సమీపంలో ఉన్న ఆకు కూరలు, కూరగాయాలు వరి సాగు చేస్తున్న అతికారి వెంకటసుబ్బమ్మ 1.50 ఎకరాల్లో ఉత్తమ యాజమాన్య పద్ధతులైన పచ్చిరొట్ట ఎరువులు, పాడి పశువుల పెంపకం, మేకల పెంపకం వంటి మిశ్రమ వ్యవసాయ విధానం, సకాలంలో సస్యరక్షణ వంటి చర్యలు చేపడుతున్నారని పొలం చుట్టూ అవిశ కూడా సాగు చేస్తున్నారన్నారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర పురుగుల మందుల షాప్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం సహాయకులు ప్రేమ్‌ సందీప్‌, బత్తల సందీప్‌ సింహయాదవ్‌, శివకుమార్‌, రైతులు పాల్గొన్నారు.

మాజీ వీఆర్‌ఓ మృతి

పెనగలూరు : మండల కేంద్రం మాజీ వీఆర్‌ఓ రామలింగయ్య స్వామి శుక్రవారం మృతి చెందారు. వీఆర్‌ఓగా పదవీ విరమణ పొందిన తరువాత ఆయన ఆలయాలలో పూజారిగా పనిచేస్తూ వస్తున్నారు. రామలింగయ్య వీఆర్‌ఓగా ఎంతోమందికి సేవలు అందించారని పలువురు నాయకులు, ప్రజలు కొనియాడారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడండి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాయచోటి అర్బన్‌ : పట్టణ ప్రజలు జ్వరాల బారిన పడకుండా, అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విశ్వనాథనాయక్‌ కోరారు. బుధవారం ఆయన మున్సిపల్‌ కమిషనర్‌ వాసుబాబును కలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో దోమలు విపరీతంగా ఉన్నాయన్నారు. దోమల నివారణ కోసం ప్రతినిత్యం సాయంత్రం వేళల్లో ఫాగింగ్‌ చేయించాలంటూ కోరారు. పారిశుద్ధ్య పనులు నిత్యం చేయించడంతోపాటు మురుగునీటి కాలువల్లో నీరు నిలవకుండా చూడలన్నారు. మురుగునీటి కాలువలపై ఉన్న ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలన్నారు. చికెన్‌ సెంటర్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడడంతోపాటు హోటళ్లలో కల్తీ, నాణ్యతలేని ఆహార పదార్థాలు విక్రయిస్తుండడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. అనంతరం ఈ మేరకు మున్సిపల్‌ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో లంబాడా హక్కుల నేత శంకర్‌నాయక్‌, రెడ్డినాయక్‌లు పాల్గొన్నారు.

శాకంబరీ అలంకరణలో అమ్మవార్లు


రైల్వేకోడూరు అర్బన్‌: శాకంబరీ దేవిగా దర్శనమిస్తున్న భువనేశ్వరి దేవి


నందలూరు: శాకంబరీ దేవి అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి

రైల్వేకోడూరు అర్బన్‌ : మండలంలోని అమ్మవారి ఆలయాలలో ఆషాఢ మూడవ శుక్రవారం పురస్కరించుకొని ప్రతేక అలంకారాలు నిర్వహించారు. అర్చకులు యోగీశ్వరశర్మ ఆధ్వర్యంలో పట్టణంలోని భుజంగేశ్వర ఆలయంలో భువనేశ్వరిదేవికి శాకంబరీ అలంకారం చేశారు. గుండాలపల్లెలోని మారమ్మతల్లి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం రాత్రి శాకంబరీ దేవి అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి భక్తులకు దర్శనమిచ్చారు. పూజలను ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం గోరింటాకు పూజ, అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాలు నిర్వహించారు.

చిరస్మరనీయులు కార్గిల్‌ యుద్ధవీరులు


రైల్వేకోడూరు అర్బన్‌: మాజీ సైనికులను సన్మానిస్తున్న నాయకులు


గాలివీడు: కార్గిల్‌ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పోలీసులు


పుల్లంపేట: అమరవీరుల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయ బృందం

రైల్వేకోడూరు అర్బన్‌ : 1999 జూలై 26న భారత్‌, పాకిస్తాన్‌ల మధ్య జరిగిన కార్గిల్‌ యుద్ధంలో పాల్గొని దేశం కోసం ప్రాణాలు అర్పించిన యుద్ధవీరులు చిరస్మరనీయులని శుక్రవారం బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యులు పులపుత్తూరు రామసుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో మాజీ సైనికులను సన్మానించి వారి అనుభవాలను తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో వాక్చర్ల సుబ్బారావు, నాగినేని సుబ్రమణ్యం, సాయం శ్రీధర్‌, సాయిఆచారి, విజయకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల చిత్రపటాలకు నివాళి

పుల్లంపేట : మండలంలోని కొత్తపేట జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కార్గిల్‌ విజయ్‌ దివాస్‌ కార్యక్రమంలో భాగంగా అమరవీరుల చిత్రపటాలకు ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున నివాళులర్పించారు. జూలై 26, 1999లో పాకిస్తాన్‌ అక్రమంగా భారత్‌లో చొరబడగా భారత ప్రభుత్వం ఆపరేషన్‌ విజయ్‌ అనే పేరుతో పాకిస్తాన్‌పై విజయం సాధించిందన్నారు. నేటికి 25 సంవత్సరాలు అయినందున అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారి చిత్రపటాలకు నివాళి అర్పించినట్టు చెప్పారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు వెంకటరత్నం సైన్యంతో తనకు ఉన్న సంబంధాలు గురించి విద్యార్థులకు తెలియజేశారు.

కార్గిల్‌ అమరవీరుల సేవలు మరవద్దు

గాలివీడు : తమ ప్రాణాలను అడ్డుపెట్టి సరిహద్దులలో దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుతూ అమరులైన వారి సేవలు మరువలేమని మండల ఎస్‌ఐ వెంకటప్రసాద్‌ పేర్కొన్నారు. శుక్రవారం కార్గిల్‌ విజయ్‌ దివాస్‌ సందర్భంగా మండల కేంద్రంలోని గౌతమ్‌ పాఠశాల విద్యార్థుతలో కలిసి బస్టాండు ఆవరణలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మాట్లాడుతూ అనునిత్యం తమ ప్రాణాలను అడ్డుపెట్టి విపత్కర పరిస్థితులను కూడా లెక్కచేయకుండా సేవ చేస్తూ సైనికులు దేశ ప్రజలను కాపాడుతున్నారన్నారు. వీరుల త్యాగాలను గుర్తు చేసకుంటూ ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం షింటో, ఇమ్మానుయుల్‌, సైజుథామస్‌, ఉపాధ్యాయులు, మండల పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్‌ దివస్‌ వేడుకలు

రాయచోటి టౌన్‌ : దేశ సరిహద్దుల్లో తమ ప్రాణాలను పణంగా పెట్టి యుద్ధం చేసి గెలవడంతోనే మనందరం ఎంతో సురక్షగా, ప్రశాంతంగా ఉన్నామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్‌ పాలగిరి శ్రీనివాసరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద గజపతి రాజు అన్నారు. శుక్రవారం శ్రీనివాసరాజు స్వగృహంలో కార్గిల్‌ దివస్‌ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంతి యుద్ధ వీరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశాంత్రి యుద్ధవీరులు నాయక్‌ (సుబేదార్‌) బసిరెడ్డి, సైనిక్‌ సంఘం అధ్యక్షులు బాలాజీ (హవాల్దార్‌), చలపతి (హవాల్దార్‌), ఏ. శేఖర్‌ నాయుడు (నాయక్‌), సి.నరసింహా రెడ్డి (నాయక్‌).లను సన్మానించారు.


రాయచోటి టౌన్‌: యుద్ధవీరులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు


రాజంపేట రూరల్‌: అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

విజయ్‌ దివస్‌ చారిత్రాత్మక ఘట్టం

రాజంపేట రూరల్‌ : 25 సంవత్సరాల క్రితం జరిగిన కార్గిల్‌ విజయ్‌ దివస్‌ చారిత్రాత్మక ఘట్టమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు అభివర్ణించారు. స్థానిక జాతిపిత మహాత్మ గాంధీ విగ్రహం కూడలి వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నాటి యుద్ధంలో అమరులైన వీర జవానులకు శుక్రవారం కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు.